# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 02-06-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా కోటి మొక్కలను నాటే కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ భాగం కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.

- ❖ నేరాల నియంత్రణే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా లక్ష నిఘా కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు.

- ❖ ప్రజా రోగ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు.

- ❖ ప్లాస్టిక్ కవర్లకు బదులుగా జనపనార, గుడ్డ సంచులను వాడాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కోరారు.

=========================

పర్యావరణం పరంగా ప్రాధాన్యత కలిగిన కొల్లేరు సరస్సును తప్పక రక్షించుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కొల్లేరుపై కేంద్ర సంస్థల ఆదేశాలు, పర్యావరణం, కాంటూరు అంశాలపై ఈ రోజు ఆయన అమరవతిలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కొల్లేరు వాసుల సమస్యలను మానవీయ కోణంలో పరిష్కరించాల్సి ఉందని, కొల్లేరు కాలుష్యం కాకుండా మురికి నీటి నిర్వహణ జరగాలన్నారు. కొల్లేరు పరిధిలో 20 వేల ఎకరాల జిరాయితీ, డీ పట్టా భూములు ఉన్నాయని, కాంటూరు సమస్య నేపధ్యంలో ముందుగా వీరికి న్యాయం జరిగేలా చూడాలని అన్నారు. 2033 నాటికి రాష్ట్రంలో పచ్చదనం 37 శాతానికి, 2047 నాటికి 50 శాతం పెరగాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అలాగే అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

=========================

నేరాల నియంత్రణే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా లక్ష నిఘా కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో నూతనంగా నిర్మించిన సత్యనారాయణపురం పోలీస్టేషన్‌ను డీజీపీ హరీష్

కుమార్ గుప్తాతో కలిసి హోంమంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఆదర్శ పోలీస్టేషన్‌గా పేరుపొందిన సత్యనారాయణపురం పోలీస్టేషన్‌ను 2 కోట్ల రూపాయలతో నిర్మాణం చేశామని, రాష్ట్రంలో జిమ్ సౌకర్యం ఉన్న తొలి పోలీస్టేషన్ ఇదేనని చెప్పారు. ప్రజలకు రక్షణ కల్పించడంతో పాటు, నేరస్థులను వెంటనే అరెస్టు చేయడంలో పోలీస్ శాఖ సమర్ధవంతంగా పని చేస్తుందన్నారు. రాష్ట్రంలో గంజాయి రవాణా చాలా వరకు తగ్గిందని, ఒరిస్సా నుంచి రవాణా అవుతున్న గంజాయిని కూడా అరికడతామని పేర్కొన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రతి జిల్లాలో ఐదు వేల మంది పోలీసులు యోగాంధ్రలో పాల్గొంటారని మంత్రి అనిత తెలియజేస్తూ...

(వాయిస్ 35 సెకన్లు)

========================

ప్లాస్టిక్ కవర్లకు బదులు జనపనార, గుడ్డ సంచులను వాడాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కోరారు. జూన్ 5వ తేదిన ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి తయారు చేసిన జనపనార సంచులను మంత్రి ఈ రోజు శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రకృతిని ప్లాస్టిక్ నాశనం చేస్తుందని, పశువులు, పక్షులు, జలచరాలు, మానవుల ఆరోగ్యానికి, ప్లాస్టిక్ సంచులు హాని కలిగిస్తున్నాయన్నారు. ప్లాస్టిక్ సంచులు ఉన్న భూమి సారం దెబ్బతింటుందని, భవిష్యత్ తరాల కోసం ప్లాస్టిక్ నిషేధించేందుకు ఈ రోజే నిర్ణయం తీసుకోవాలని మంత్రి సూచించారు.

========================

ప్రజా రోగ్యానికి కూటమి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో ఈ రోజు 70 మంది పేదలకు 28 లక్షల రూపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి ఈ సందర్భంగా పేర్కొంటూ...

(వాయిస్ 37 సెకన్లు)

విరామం

========================

రాష్ట్రంలో ఇప్పటి వరకు 34.81 లక్షల మందికి రేషన్ సరకులు అందించామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విజయవాడలో ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... 3.73 లక్షల మంది వృద్ధులు, దివ్యాంగులకు ఇంటింటికీ వెళ్లి రేషన్ సరకులు అందించామన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు ఈ నెల 5వ తేదీ లోగా రేషన్ ఇవ్వాలని డీలర్లను ఆదేశించామని తెలిపారు. కొన్ని చౌకధరల దుకాణాల వద్ద సర్వర్ సమస్యలు తలెత్తాయని, వెంటనే పరిష్కరించి పంపిణీ కొనసాగించామని... కార్డుదారులకు మరింత సౌకర్యం కల్పిస్తూ.. ఏ దుకాణానికైనా వెళ్లి రేషన్ తీసుకునేలా పోర్టబులిటీ తీసుకొచ్చామని మంత్రి తెలిపారు.

========================

“జల్ జీవన్ మిషన్” పథకంలో ధవళేశ్వరం గోదావరి పైపులైను పనులను వేగవంతం చేసేందుకు కృషి చేస్తున్నామని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ వెల్లడించారు. ఈ రోజు మంత్రి పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో పాత్రికేయులతో మాట్లాడుతూ... భీమవరంలో 11 రైలు పై వంతెన (ఆర్‌ఓబీ)ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసామన్నారు. ఇప్పటికే తాడేపల్లిగూడెంలో మూడు పై వంతెనల నిర్మాణానికి 208 కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యేందుకు కృషి చేశామన్నారు. నర్సాపురం పార్లమెంటు పరిధిలో 40 ఫ్లై ఓవర్లను నిర్మించేందుకు ప్రాజెక్టు సమగ్ర నివేదికను సిద్ధం చేశామని శ్రీనివాస వర్మ తెలియజేస్తూ...

(వాయిస్ 37 సెకన్లు)

=========================

దేశంలోని మారుమూల ప్రాంతాలు మొదలుకొని ప్రపంచ దేశాలకి సంబంధించిన రోజువారీ విశ్వసనీయమైన సమాచారాన్ని ప్రసారభారతి శబ్ద్ పోర్టల్ వార్తా కథనాల రూపంలో ఉచితంగా అందిస్తోంది. అనేక అంశాలకు సంబంధించి రోజుకు 800 కి పైగా వార్తా కథనాలను 15 భాషల్లో శబ్ద్ పోర్టల్ ద్వారా వీక్షించవచ్చు. అయితే ఈ శబ్ద్ పోర్టల్ లోని సమాచారాన్ని కంటెంట్ క్రియేటర్స్, యూట్యూబర్స్ మొదలుకొని ఇప్పుడు ఎవరైనా ఉచితంగా ఉపయోగించుకోవచ్చని, ఎటువంటి కాపీ రైట్స్ సమస్యలు ఉండవని ప్రసారభారతి ఒక ప్రకటనలో తెలిపింది.

=========================

"ప్రధాన మంత్రి సూర్య ఘర్" సోలార్ విద్యుత్తుపై ప్రజలకు అవగాహన కల్పించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ స్పష్టం చేసారు. ఈ రోజు కలెక్టర్ దృశ్య మాధ్యమ విధానంలో అన్ని విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇంటి పై కప్పుపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకునే వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం రాయితీ గురించి వివరించాలని సూచించారు.

=========================

దేశంలోని ప్రభుత్వ పాఠశాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిన కేంద్రప్రభుత్వం పిఎం శ్రీ పథకం ద్వారా కొన్ని పాఠశాలలను ఎంపిక చేసి ఆ పాఠశాలల్లో మెరుగైన వసతులను విద్యార్ధులకు కల్పిస్తోంది. ఈ సంవత్సరం తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలోని కాసాగార్డెన్  వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలను పీఎంశ్రీ పథకానికి కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవిలత ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... దాదాపు 640 మంది విద్యార్థులు చదువుతున్న ఈ పాఠశాలను కేంద్రప్రభుత్వం పరిగణంలో  పియంశ్రీ పథకానికి ఎంపిక చేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

=========================

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పేర్కొన్నారు. ఈ రోజు భీమవరంలో  జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు చేపట్టాల్సిన చర్యలపై కలెక్టర్ సమీక్షించారు. బాల కార్మికులను రక్షించడం, పాఠశాల విద్య అందించడం, సమర్ధవంతమైన పునరావాస ఏర్పాటు కోసం సంబందిత విభాగాల ప్రతినిధులు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులతో పాటు కార్మిక శాఖ వివిధ పని ప్రదేశాలలో బాల కార్మికులను గుర్తించాలని తెలియజేశారు.

=========================

మహిళలకు గౌరవం పెంచేలా మహిళా కమీషన్ సమర్ధవంతంగా పని చేస్తున్నదని కమిషన్ చైర్పెర్సన్ రాయపాటి శైలజ అన్నారు. ఈ రోజు ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో పాత్రికేయులతో ఆమె మాట్లాడుతూ... అధికార, విపక్ష పార్టీలకు సంబంధం లేకుండా బాధిత మహిళలకు తక్షణ సహాయం అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించడం నుంచి దర్యాప్తు అధికారులు చర్యలు తీసుకునే వరకూ కమిషన్ పర్యవేక్షణ లోపించకుండా పని చేస్తుందని పేర్కొన్నారు.

=========================
=========================